నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 13 ఆగస్టు 2023

వీఆర్ఏకు సన్మానం



సంజయ్‌ను సన్మానిస్తున్న పలువురు నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని పెద్దటాక్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ సంజయ్ కామ్‌లేకు రికార్డ్ అసిస్టెంట్‌గా మెడ్చల్ జిల్లాలో పోస్టింగ్ రావడంతో శనివారం ఆయనను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వి జిల్లా అధ్యక్షులు విలాస్, సామాజిక కార్యకర్త సాయలు గొండ, వార్డ్ మెంబెర్ దిలీప్ కుమార్ , మాధవ్, రవి పాటిల్, పాల్గొన్నారు.

ఎస్సై ఉద్యోగం పొందిన యువకునికి సన్మానం



నవతెలంగాణ-లింగంపేట్

ఎస్ఐ ఉద్యోగం పొందిన లింగంపేట్ మండలంలోని మోతే గ్రామానికి చెందిన వజీర్ ప్రసాద్ రావు (తండ్రి: వజీర్ రాజేశ్వర్ రావు)ను శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. శాలువతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. కామారెడ్డి జిల్లాకు 8 ఎస్సై ఉద్యోగాలు రాగ అందులో ఒకరు లింగంపేట్ మండలానికి చెందిన వారు కావడం గర్వంగా ఉందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేష్ ,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, నల్లమడుగు సింగిల్ విండో చైర్మన్ సుప్పాల రమేష్, సీడిసి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి హట్టెం శీను, మండల యూత్ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు.. గొప్పపథకం

- కులవృత్తులకు ప్రోత్సాహం.. దేశంలో మరెక్కడా లేదు..
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- పలువురు లబ్దిదారులకు లక్ష రూపాయల చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బాన్సువాడ

'కుల వృత్తులను ప్రోత్సహించడానికి బీసీ బంధు పథకం.. గొప్ప కార్యక్రమం. ఇలాంటి పథకం దేశంలోనే మొదటిసారి. బలహీన వర్గాలకు దేశంలో 100 శాతం సబ్సిడీపై ఆర్థిక సాయం అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్' అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ మున్సిపాలిటీ, బీర్కూరు, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలో మంజూరైన లక్ష రూపాయల బీసీ బంధు చెక్కులను శనివారం బాన్సువాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ 'గత ప్రభుత్వాల హయంలో ఎవరైనా లబ్దిదారులు స్వంతంగా వ్యాపారం చేసుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే 20 శాతం సబ్సిడీ మంజూరు కావడానికి చెప్పులు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. పైరవీలకే సగం డబ్బులు ఖర్చు అయ్యేవి. మిగతా 80 శాతం వాటా కోసం బ్యాంకుల చుట్టూ సంవత్సరాలు తిరగాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు. చెక్ తీసుకుని వెళ్ళి బ్యాంకు నుండి నగదు తీసుకుని మీ కుల వృత్తి వ్యాపారం చేసుకోవచ్చు'.



చెక్కులు అందజేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ జితేశ్ వి పాటిల్

'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల ప్రజలకు ఇస్తున్న లక్ష రూపాయల పథకం మొత్తం సబ్సిడీనే. ప్రస్తుతం నియోజకవర్గానికి 300 మంది లబ్దిదారులకు ఇస్తున్నాం. బాన్సువాడ మున్సిపాలిటీ, బాన్సువాడ గ్రామీణ, నస్రుల్లాబాద్, బీర్కూరు మండలాల పరిధిలో 2000 మంది అర్హులైన వారు ఉన్నారు. విడతల వారిగా ప్రతినెలా కొంతమందికి అందుతాయి. ఇదో నిరంతరం కార్యక్రమం. ఎవ్వరూ నిరాశ పడనక్కర్లేదు. అందరికీ ఈ పథకం అందుతుంది. ఈ నగదు సహాయాన్ని వృధా చేయెుద్దు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మీరు, మీ కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని' ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు డి. అంజిరెడ్డి, ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



హాజరైన లబ్దిదారులు, కార్యకర్తలు, నాయకులు

రైతుల దీక్ష భగ్నం



రైతులకు అరెస్టు చేస్తున్న పోలీసులు

- రైతులతోపాటు, అధికార పార్టీ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-రెంజల్

పంట పొలాలకు వెళ్లే దారిలో రోడ్డు వేయించాలని, మరమ్మతులు చేయించాలని మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట చేపట్టిన రైతుల రిలేదీక్షను పోలీసులు శనివారం భగ్నం చేశారు. ఉదయం నుంచి రైతు దీక్షా శిబిరం ఎదుట అధికార పార్టీ నాయకులు బైఠాయించడంతో రైతులకు, నాయకులకు మాటల యుద్ధం కొనసాగింది. ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకున్నారు. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ సిఐ, టౌన్ సిఐ తో పాటు, రెంజల్ ,ఎడపల్లి బోధన్ ఎస్ఐలు పోలీసు బలగాలతో దీక్ష శిబిరం వద్ద మొహరించారు.

రైతులు, అధికార పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఇరువురితో పోలీస్ యంత్రాంగం పలు మార్లు చర్చలు జరిపినా వినకపోవడంతో, బోధన్ ఎసిపి ఆదేశాల మేరకు వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. రెండు డీసీఎంలను తీసుకువచ్చి బలవంతంగా వారిని అక్కడి నుంచి తరలించి వేశారు. అధికార పార్టీ నాయకులు ప్రొసిడింగ్ ఆర్డర్లను చూయించినా, పనులను ప్రారంభించేంతవరకు దీక్షను విరమించే ప్రసక్తే లేదని వారు పట్టుపట్టారు. ఇరు గ్రూపులు ఒకరిపై ఒకరు విమర్శల వర్షం కురిపించారు. అధికార పార్టీ నాయకులు సీఎం కేసీఆర్, బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. దీంతో గ్రూపుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. రైతులకు బిజెపి, కాంగ్రెస్ పార్టీలు మద్దతు ఇస్తు తమ నాయకుడిని బదనాం చేస్తున్నారని అధికార పార్టీ నాయకులు విమర్శించారు. విధి లేని పరిస్థితిలో పోలీస్ శాఖ వారు స్పెషల్ ఫోర్సునదించి రెండు వర్గాల వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. గాంధీ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసుకున్న రైతుల దీక్ష శిబిరాన్ని పోలీసులు తొలగించి వేశారు.





రైతులకు పోటీగా దీక్ష చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు... నాయకుల అరెస్ట్, తరలింపు.. రైతుల టెంట్ తొలగిస్తున్న పోలీసులు

థియేటర్‌లలో గాంధీ చిత్రం ఉచిత ప్రదర్శన

- వజ్రోత్సవాల ముగింపులో భాగంగా 14వ తేదీ నుంచి 24 వరకు ప్రదర్శన



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఈ నెల 14 నుండి 24 వరకు రాష్ట్రంలోని సినిమా దియేటర్ లలో జాతిపిత మహాత్మాగాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించుటకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 2022లో వజ్రోత్సవాల ప్రారంభ సమయంలో కూడా విద్యార్థులలో జాతీయ స్ఫూర్తిని పెంపొందించే విధంగా గాంధీ చిత్రాన్ని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉచితంగా ప్రదర్శించగా, లక్షలాది మంది విద్యార్థులు వీక్షించారు. విద్యార్థులను థియేటర్ ల వద్దకు ఉచితంగా తీసుకెళ్ళి క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా దేశ స్వాతంత్రం కోసం ఎంతో పోరాడిన జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్రను తెలియజేసే గాంధీ చిత్రాన్ని కేవలం విద్యార్థులకు మాత్రమే కాకుండా వారి తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు కూడా వీక్షించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈనెల 14వ తేదీన ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది. 15న ఇండిపెండెన్స్ డే సందర్భంగా, 20న ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదు. ఈనెల 16 నుండి 24 వరకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో థియేటర్ ల నిర్వహకులు, విద్యాశాఖ, రవాణా శాఖ, పోలీసు శాఖ, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారులు గాంధీ చలన చిత్ర ప్రదర్శన ఎలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయం చేయనున్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

- యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు వై విజయకుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని యూఎస్‌పీఎస్‌సీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు వై విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు వై. విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అనేక మంది ఉపాధ్యాయులు పదోన్నతులు లేకుండానే రిటైర్డ్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించనీ యెడల వేలాది ఉపాధ్యాయులతో సెప్టెంబర్ ఒకటో తేదీ చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర నాయకులు పి. శంతన్, డి. సత్యానంద్ మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కట్టుబడి సాధారణ ఎన్నికలలోపు స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. సిపిఎస్ విధానంలో రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, పెన్షన్ గా 2000 రూపాయలు కూడా పొందలేని దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 317 జీవో వల్ల సొంత జిల్లా వదిలి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు బదిలీ చేయడానికి అవసరమైతే సూపర్ న్యూమరి పోస్టులు సృష్టించాలని, భార్య భర్తల బదిలీలు నిలిపివేసిన 13 జిల్లాల ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని,317 జీవో బదిలీల వల్ల అన్యాయానికి గురై అప్పీలు చేసుకున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు. ఒ. రమేష్, వి. సురేష్, ఎం. బాలయ్య, సిహెచ్. సుధాం మాట్లాడుతూ మొదటి పే రివిజన్ కమిషన్ గడువు 2023 జూన్ 30తో ముగిసినందున తాత్సారం చేయకుండా వెంటనే రెండవ పిఆర్సి కొరకు కమిషన్ను నియమించాలని, జూలై 2023 నుండి అమలయ్యే ల తాత్కాలిక భృతిని 25 శాతం ప్రకటించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న వివిధ రకాల బిల్లుల కు తక్షణమే చెల్లింపులు జరపాలని, వేతనాలు చెల్లింపులో జాప్యాన్ని నివారించి ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా శిబిరంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఆర్. రాజన్న, సల్ల సత్యనారాయణ, భోజన్న, నాయకులు, పి.దాసు, రాందాస్, ప్రవీణ్, గంగాధర్, అరవింద్, చందర్, తుకారం, లింగం, పెంటన్న, గంగ నరసయ్య, బాలరాజు,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

ప్రాణాలు తీసిన చేపల వేట

- నీటమునిగి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

నవతెలంగాణ-జుక్కల్/గాంధారి

చేపల వేట ప్రాణాలు తీసింది. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకోగా.. బాధిత కుటుంబాల్లో తీరని శోకం నింపింది.



జుక్కల్ : రోదిస్తున్న కుటుంబీకులు

జుక్కల్ మండలంలోని పెద్దఎడ్గివాగులో.. పెద్దఎడ్గి గ్రామానికి చెందిన గంగారాం(48) నిత్యం చేపల వేట కొనసాగించేవారు. శనివారం సైతం రోజువారీగా చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

చేపల వలలో చిక్కుకొని..

గాంధారి : గాంధారి మండలంలోని ముదోలి గ్రామానికి చెందిన చింతకింది మొగులయ్య (40) తన వ్యవసాయ పొలానికి దగ్గరలో ఉన్న వాగులో చేపల వేటకని వెళ్లి ప్రమాదవశాత్తు దానిలో పడి వలలో తట్టుకొని మృతిచెందినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఉదయం తన ఇంటి నుండి చేపల వేటకని వెళ్లగా తిరిగిరాకపోవడంతో మృతుడి కుమారుడు వెళ్లి చూడగా.. వలకు చిక్కుకొని కనిపించాడు. మృతునికి ముగ్గురు కుమారులు, భార్య ఉన్నది. మృతుని భార్య చింతకింది లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



వలలో చిక్కుకొని మృతిచెందిన మొగలయ్య

బీఆర్ఎస్ హయాంలోనే తండాల అభివృద్ధి

- గిరిజనతండాకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ అన్నారు. లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో శనివారం పోల్కంపేట తండా బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోల్కంపేట్ తాండ రోడ్డు నిర్మాణం కు రెండు కోట్ల 80 లక్షల రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు. త్వరలోనే రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని అన్నారు. గిరిజనులతో మాట్లాడుతూ మీకు రోడ్డు నిర్మాణంతో శాశ్వత పరిష్కారం అయినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గాను సంతోషం వ్యక్తం చేశారు. తాము ఎన్నో సంవత్సరాలుగా మోకాలు మట్టి బురదలో తండాకు చేరుకోవాలంటే కష్టతరంగా ఉండేదన్నారు. తండాలో ప్రమాదాలు జరిగితే రోడ్డు మార్గం లేక వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు అన్నారు.



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ షేట్పల్లి సంగారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ బండారు కృష్ణా రెడ్డి సంజీవరెడ్డిని ఆయన పరామర్శించి ఓదార్చరు, రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ పద్మా నాగరాజు బిఆర్ఎస్ అధ్యక్షులు రమేష్ ,జడ్పీటీసీ శ్రీలత సంతోష్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటి, ఎల్లారెడ్డి ఏఎంసి వైస్ చైర్మన్ సిద్ధిరామిరెడ్డి, లింగంపేట సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, నల్లమడుగు సింగిల్ విండో చైర్మన్ పుప్పాల రమేష్, మైనార్టీ నేత నయిం తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ టూర్ ఏర్పాట్లు షురూ



పూజ చేసి సభాస్థలి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఈనెల 14 (సోమవారం) రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం ప్రారంభించినట్టు పార్టీ పట్టణ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, ఆదిమూలం సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు మొట్టమొదటిసారిగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి వస్తున్న సందర్భంగా నాయకులు ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సభాస్థలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించామని వారన్నారు. ముఖ్యంగా సభా స్థలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రవణ్ కుమార్, నాగం సురేందర్, పాల్దే నారాయణ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలోని వజ్జెపల్లి గ్రామంలో శనివారం ఆవులు,ఎద్దులు(142), గేదెల (252)కు గాలికుటండు నివారణా టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి డా.ఆర్ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సయ్య, విజయ డెయిరీ అధ్యక్షులు రమేష్, పశుగణ సహాయకులు డి.జుగల్ కిషోర్, సిబ్బంది ఇస్మాయిల్, సాయి కుమార్, గోపాల మిత్రులు మురళి, కాశిరెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

20న దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ

- హాజరుకానున్న ఆకునూరి మురళి, ప్రొఫెసర్ ఖాసీం

నవతెలంగాణ-పిట్లం

దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ కరపత్రాన్ని మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి అయ్యల సంతోష్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ఎస్సీ , ఎస్టీ ఉపాధ్యాయ , ఉద్యోగ , దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి దళిత , గిరిజన ఆత్మగౌరవ సభ మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆకునూరి మురళి (మాజీ ఐఏఎస్) , ప్రొఫెసర్ కాశీం , రాష్ట్ర ఎంఆర్పిఎస్ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ , ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ బాబు సింగ్ , జిల్లా అధ్యక్షులు భాధ్యా నాయక్ పాల్గొంటున్నందున జిల్లాలోని దళిత , గిరిజన సంఘ నాయకులతోపాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హనుమ బంగారు రవి, సంగు గోవర్ధన్, గైని బాలయ్య, రాజబాబు, గుడ్డేలుగుల లాలూ, గంగేష్ సింగ్ , బహదూర్ సింగ్ , హనుమ ప్రవీణ్ , అమృతం , బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పలువురు

మద్యపానం నిషేదిస్తూ తీర్మానం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని మాధవపల్లీ గ్రామంలో మద్యపానం విక్రయాలు, సేవణం నిషేదిస్తూ గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీ, గ్రామాభివృద్ధి కమిటీ శనివారం సమావేశమై తీర్మానం చేశారు. మద్యం అమ్మిన వారికి రూ.50,000 జరిమానా విధించాలని నిర్ణయం తీసుకున్నారు. మద్యం అమ్మిన సమయంలో ఎవ్వరైనా సమాచారం తెలియజేస్తే వారికి రూ.5000 పారితోషికం ఇవ్వనున్నట్టుతెలిపారు.



తీర్మాన ప్రతిని చూపుతున్న గ్రామస్తులు

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్

జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవీపేట్ మండలంలోని మాన్ సింగ్ తండాలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం ఫకీరాబాద్ రాథోడ్ రామ్ (26) శనివారం మధ్యాహ్నం తల్లి హాలులో నిద్రపోగా బెడ్ రూమ్ లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. కుటుంబం, వ్యక్తిగత సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకున్నాడని తల్లి రాథోడ్ శేవంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడికి నలుగురు కుమారులు ఉన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలి

- బీఎస్‌పీ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేపట్టిన నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రూప్ 2 అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని విద్యార్థుల పక్షాన బహుజన సమాజ్ పార్టీ నిలుస్తుందని బహుజన సమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ గైని గంగాధర్ అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి నిరంకుశ వైఖరిని మానుకొని తెలంగాణలో ఉన్నటువంటి ఆరు లక్షల గ్రూప్ టు అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ గైని గంగాధర్, జిల్లా అధ్యక్షులు పల్లికొండ నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు పీట్ల శ్రీనివాస్ ఎర్రోళ్ళ గంగాధర్, హరీష్ , ఆర్మూరు నియోజకవర్గ ఇంచార్జ్ సుధాకర్, రూరల్ ఇంచార్జ్ కళ శ్రీనివాస్ , భోధన్ ఇంచార్జ్ సింగిడి పాండు, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ గుంటి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ అడ్మిషన్‌లకు సహకరించాలి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసి డిగ్రీ కాలేజీలో కావాల్సినన్ని అడ్మిషన్‌లు జరిగే విధంగా ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలని ఎంఎస్‌యూ నాయకలు బాలు యాదవ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కళాశాల కొనసాగడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈనెల 13తో అడ్మిషన్ల ఘట్టం ముగియనుందని, అయితే ఇక్కడ కాలేజీ ఆలస్యంగా ప్రారంభం కావడంతో అంతకుముందే వేరే చోట్ల విద్యార్థులు అడ్మిషన్‌లు తీసుకున్నారని తెలిపారు. అయితే అలాంటి వారికి ఇక్కడే అడ్మిషన్‌లు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటానికి రేషన్ డీలర్ల క్షీరాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు రేషన్ డీలర్లు శనివారం క్షీరాభిషేకం చేశారు. రేషన్ డీలర్ల కమీషన్‌ను రూ.70 నుంచి రూ.140కి పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ కేసీఆర్, కవిత, ప్రశాంత్‌రెడ్డిల చిత్రపటానికి రేషన్ డీలర్లు క్షీరాభిషేకం చేశారు. కమీషన్ పెంచడం ద్వారా తమకు ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి రేషన్ డీలర్లు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు గాండ్ల రాజేందర్, సాగర్ యాదవ్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నవతెలంగాణ-సిరికొండ

జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ, ప్రాథమిక పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని మైలారం గ్రామంలో గేదెలు, ఆవులకు, దూడలకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి బాబురావు తెలిపారు. వాతావరణంలో మార్పులు, నూతన పశుగ్రాసం వలన పశువులు, వాటి దెబ్బలలో వాపులు తదితర సమస్యలు మొదలవుతాయని, టీకాలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా.బాబురావు, సర్పంచ్ గాండ్ల రమ్య సత్యానంద్, వీడీసీ సభ్యులు, పశువైద్య సహాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీష్, పశు మిత్రలు మమత, మౌనిక పాడి రైతులు పాల్గొన్నారు.

తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో మహాజన సభ



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

తాళ్లరాంపూర్ పీఏసీఎస్‌లో మహాజన సభను సంఘం అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సంఘం కార్యదర్శి 1-4-2022 నుంచి 31-3-23 వరకు సంఘం జమ, ఖర్చులను చదివి వినిపించారు. రైతులకు బాకీ పడిన పైసల కోసం డీసీఎం రూ.6లక్షల 40 వేలకు అమ్మకానికి సంఘం సభ్యులు తీర్మానించారు. డిపాజిట్ దారులకు బాకీపడ్డ డబ్బులు 80 శాతం చెల్లించడానికి మిగిలిన 20 శాతం బకాయి రసీదు ఇచ్చుటకు సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి కోర్ట్ కేస్ గురించి డీసీఓను తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకోవాలని సభ్యులందరూ ఆమోదించారు. ఫర్టిలైజర్ అవుట్‌లెట్ కోసం తీసుకువచ్చిన డబ్బులు చెల్లించాలని సభలో ఆమోదించారు. రైస్ మిల్లుకు సంబంధించిన వరి ధాన్యం నష్టాన్ని సంఘమే భరించాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎరువులు నేరుగా సంఘానికి వచ్చేటట్లు లైసెన్స్ తీయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు ఆడెం గంగాప్రసాద్, సంజీవ్, రవి, సాయిరాం, రవీందర్, చిన్నోళ్ల రాజారెడ్డి, మచ్చెం గంగు, దొంచంద సర్పంచ్ గడ్డె రాధ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కాలనీలో పర్యటించిన నాయకులు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని 19వ వార్డ్ ఇందిరమ్మ కాలనీలో శివసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి నాయకులు శనివారం కాలనీలో పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో మంచినీటి సమస్యలు, మురికి కాల్వలు లేకపోవడంతో ప్రజలు డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులకు గురవుతున్నారని కాలనీవాసులు తెలిపారు. రోడ్లు లేకపోవడంతో విద్యార్థులకు, సామాన్య ప్రజల రాకపోకలు ఇబ్బందిగా మారిందని జనం వివరించారు. కాలనీ సమస్యలను శివసేన పార్టీ పట్టణ అధ్యక్షులు ఏనుగంటి గౌతమ్‌గౌడ్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ధర్మపురి భూమయ్య, ఉపాధ్యక్షులు మధుబాబు, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, శివసేన నాయకులు నర్సింలు, బిక్ష విజయ్, నరేందర్, శ్రీకాంత్, దుర్గం విజయ, రాజు, శ్రీను, లక్ష్మణ్, రాము, గంగాధర్, దిగంబర్, గంగాధర్, దీపక్, నాగరాజు, నాయకులు లోకేష్‌గౌడ్, కాస్తు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షకు హాజరు కావాలని, ఫలితాలు ఈ నెల 21న ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మున్నూరుకాపు సంఘం భవనానికి నిధులు మంజూరి చేయాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ మున్నూరు కాపు సంఘం భవనానికి నిధులు మంజూరి చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. వార్డ్ నెంబర్ 10లో నిర్మిస్తున్న మున్నూరు కాపు భవనానికి నిధులు మంజూరి చేయాలని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు విన్నవించారు. దాంతో ఎమ్మెల్యే స్పందించి వెంటనే 5లక్షల రూపాయలు మంజూరి చేస్తున్నట్లు ప్రకటించారని గంగాధర్ తెలిపారు. మరో విడతలో మరో 5లక్షలు మంజూరి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు గంగాధర్ గౌడ్, తోకల గంగాధర్ ఉన్నారు.

వన్నెల్ (బి) వాసి నవీన్‌కు ఉస్మానియా డాక్టరేట్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) గ్రామానికి చెందిన పాతాల నవీన్ కు ఫార్మసీ రంగంలో చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. పాతాల నవీన్ ఉస్మానియా యూనివర్సిటీ- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ-ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ శశికళ, జి.పుల్లారెడ్డి కాలేజీలో ఫార్మసీ ప్రొఫెసర్ బి.వీరేష్ పర్యవేక్షణలో "రి పర్పసింగ్ న్యూరో ప్రొటెక్టివ్ పొటెన్షియల్ ఆఫ్ సెలెక్టెడ్ నానో న్యూట్రాస్యూటికల్ డెలివరీ సిస్టమ్స్ (ట్రాన్స్‌ఫ్యూషన్ ఇన్హిబిటర్స్) ఫర్ సెరిబ్రల్ ఇస్కీమిక్ స్ట్రోక్ ఇన్ విస్టార్ రాట్స్" అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పేద మధ్య తరగతి నుంచి వచ్చిన తాను కష్టపడి డాక్టరేట్ సంపాదించడం గర్వంగా ఉందన్నారు. నవీన్ తండ్రి గల్ఫ్ కార్మికుడిగా, తల్లి వ్యవసాయం చేసి తన పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. వారి నమ్మకాన్ని వృథా చేయకుండా పెద్ద కుమారుడు డాక్టరేట్, కూతురు పి.మౌనిక రైల్వే విభాగంలో కానిస్టేబుల్‌గా, చిన్న కుమారుడు ప్రవీణ్ బ్యాంక్ ఉద్యోగాలు సంపాదించారు. ప్రస్తుతం అనురాగ్ విశ్వవిద్యాలయంలో నవీన్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించిన నవీన్‌ను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, అభినందించారు.

గృహలక్ష్మి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలన



క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో రూరల్ ఎమ్మార్వో జై అనురోధ్ ఆధ్వర్యంలో గృహలక్ష్మి దరఖాస్తుదారులను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నెల 20వరకు పరిశీలన అనంతరం నివేదిక లబ్ధిదారులను ఈనెల 25న ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ హరీష్ ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ.. కండ్లున్న కబోదులు

- నయవంచకుడు ఎంపీ అరవింద్
- ఈసారి డిపాజిట్లు కూడా రానీయం
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఫైర్



బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

'కాంగ్రెస్, బీజేపీ నేతలు కండ్లుండి.. చూడలేని కబోదులు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకోవడం, దాచుకోవడం కాంగ్రెస్‌కు తెలిసిన ఏకైక విద్య. ఎన్నడైనా ప్రజలను పట్టించుకున్న పాపాన పోయారా?. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేరు. కాంగ్రెస్, బీజేపీ సన్నాసులకు అభివృద్ధి గిట్టదు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వక్రనీతి' అని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై మండిపడ్డారు. ఆకాశమే హద్దుగా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి దూసుకుపోతున్నదని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పతేపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నారా యణగౌడ్‌తో పాటు ఆ గ్రామంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కు చెందిన నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. తామంతా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు, ప్రధానంగా గౌరవ ముఖ్య మంత్రి కేసీఆర్ సమర్థవంత పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నాయకత్వానికి వారు మద్దతు పలికారు. అంకాపూర్‌లోని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాసంలో శనివారం జరిగిన కార్యక మంలో ఆయన సమక్షంలో వారు గులాబీ తీర్థం పుచ్చు కున్నారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. "అద్భుతమైన పర్యాటక కేంద్రంగా సిద్దుల గుట్టను తీర్చిదిద్దాం. ఆర్మూర్ మెడలో అభివృద్ధి ఆభరణాలుగా మురిపించేలా తొమ్మిది కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మించాం. ఆర్మూర్ నియోజకవర్గంలో దాదాపు రూ.200ల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. ఫతేపూర్, సుర్బిర్యాల్, చేపూర్, కుద్వాన్‌పూర్, జోర్‌పూర్, మచ్చర్ల, కంఠం, చికిలీ, గుంజిలీ, సిద్దాపూర్, నికాల్‌పూర్‌లలో 13 లిఫ్టుల నిర్మాణం చేపడుతున్నాం. ఈ లిఫ్టుల కోసం రూ.7కోట్లు మంజూరు చేసిన గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నాం. బీసీ, మైనారిటీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక చేయూత నందిస్తున్నాం. త్వరలోనే 10వేల మందికి ఇండ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. గృహలక్ష్మి స్కీమ్ ద్వారా 3వేల ఇండ్ల నిర్మాణం చేపడతాం" అని జీవన్ రెడ్డి వెల్లడించారు. 'ఫేక్, ఫాల్స్, ఫ్రాడ్ అరవింద్ నిజామాబాద్ జిల్లాకు పట్టిన శనిగొట్టు ఎంపీ అని, పసుపుబోర్డు తేకుండా రైతులను మోసగించి నయవంచకుడు మండిపడ్డారు. అరవింద్‌కు డిపాజిట్లు రాకుండా వెంటబడి ఓడిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని క్రమబద్ధీకరించాలి

- ఏఎన్ఎంల డిమాండ్
- అంబేద్కర్ విగ్రహానికి వినతి..



ఆర్మూర్‌లో..

నవతెలంగాణ-బోధన్/ఆర్మూర్

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ శనివారం సెకండ్ ఏఎన్ఎంలు బోధన్ పట్టణంలోని మున్సిపల్ పార్క్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో తమ నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం సెకండ్ ఏఎన్ ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రులు పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ ఎంలు, ఈసీ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని పోరాడుతున్న ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని అన్నారు. కరోనా కష్టకాలంలో కుటుంబాలను, ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన వీరికి సన్మానా లు చేసి, ఇప్పుడు సమస్యలు అడిగితే అరెస్టులు చేసి బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం చుట్టూ తిరిగిన సమస్యలపై స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరితే, తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వీరి స్థానంలో కొత్తవారిని నియమించడం కోసం కొత్త నోటిఫికేషన్ వేసిందని, దానిని తక్షణమే రద్దు చేయాలన్నారు. కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీగా వెళ తూ ఎమ్మార్వో కార్యాలయం ముందు నుంచి అంబేద్కర్ చౌరస్తాలో 10 నిమిషాలు మానవహారం చేపట్టారు. కాంట్రాక్టు ఏఎన్ఎంల సమస్యలను తొందరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి జ్ఞానోదయం కలగాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు గంగా జమున, ప్రమీల, అమృత, కమల, స్వప్న, పద్మ, విమల, రాధిక, మమత, సుమలత, కవిత తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో..

ఏఎన్ఎంల సమస్యల పరిష్కారంకై ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భరతమ్మ, సంధ్యారాణి, శోభ, రేణుక, మల్లేశ్వరి, కవిత, పవన్, శంకర్, వెంకటేష్ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 9 రోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. వీరికి సీఐటీయూ మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతూ..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 500లకే సిలిండర్

- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి



మాట్లాడుతున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 500 రూపాయలకే సిలిండర్ అందజేస్తామని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అర్గుల్ గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పథకమని కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్గుల్ గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అర్గుల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించారు. అదేవిధంగా బీఆర్ఎస్ చేస్తున్న మోసాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనిత, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, యువజన విభాగం మండలాధ్యక్షుడు వినోద్, మండల ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50వేల డిపాజిట్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామానికి చెందిన అజీస్ నిత్యం కూలీ పని చేస్తూ తన జీవనాన్ని సాగించే వాడు. దురదృష్టవశాత్తు కొద్ది రోజుల క్రితం ఆయనకు రక్త కణాలు ఒక్కసారిగా పడిపోవడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ఇద్దరు కూతుళ్లు సహస్ర (4), శాన్వీ(2) ఉన్నారు. వారిది నిరుపేద కుటుంబం, ఆయన మరణంతో వారి కుటుంబం అనాథగా మారడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని కల్పించారు. చిన్న పిల్లలు ఉండటంతో వారిని భవిష్యత్తులో మంచిగా చదివించి ప్రయోజకులను చేయాలని మృతిని భార్యకు సూచించారు. ఇద్దరు ఆడపిల్లల కోసం రూ.50వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. వారి తక్షణ అవసరాల కొరకు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, పడిగెల ప్రవీణ్, ఎడ్ల శ్రీకాంత్, తెద్దు రమేష్, సుంకెట శ్రీను, బద్దం రవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

నవతెలంగాణ-బోధన్/రెంజల్

సాలూర మండలం హున్సా సొసైటీ చైర్మన్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు మందర్న రవి కాలికి ఆపరేషన్ కావడంతో బోధన్ పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి శనివారం ఆసుపత్రికి వెళ్లి సొసైటీ చైర్మన్ మందర్న రవిని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగం, నాగేశ్వర్‌రావు, నరేందర్‌రెడ్డి, గణపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ రవీందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు పరాన్, అల్లే రమేష్, దామగ తదితరులున్నారు.

రెంజల్ : మండలంలోని బోర్గాం గ్రామంలో సీలం లక్ష్మి, కుర్మె మల్లన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి పి.సుదర్శన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన అన్నారు.

సీఎం కేసీఆర్, బోధన్ ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్ గాంధీ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ మండల నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే షకీల్ అమీర్ చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని బండ, మాచాపూర్, గంగమ్మ తల్లి, దూపల్లి ఎక్స్‌రోడ్డు పనులకు రూ.3.45 లక్షలు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, షకీల్ ఆమీర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు భూమారెడ్డి, సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్, మీర్జా కలీం బేగ్, సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు కాశం సాయిలు, రైతుబంధు జిల్లా డైరెక్టర్ మౌలానా, సీనియర్ నాయకులు రఫీక్, శేఖర్, ప్రశాంత్, గ్రామ కమిటీ అధ్యక్షులు అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కలిగోట్‌లో ఉచిత ఆయుర్వేద శిబిరం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలో ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ లలిత శనివారం తెలిపారు. గ్రామంలోని ప్రజలందరికీ గ్రామపంచాయతీ ఆవరణలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లలిత మాట్లాడుతూ.. ఆయుర్వేదంలో అన్ని రకాల రోగాలకు మందులు ఉన్నాయని ఆయుర్వేదం పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బీపీ, షుగర్, జ్వరం, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో చికిత్స ఉన్నదని తెలియజేశారు. కార్యక్రమంలో చేతన, విజయరెడ్డి, ఎంపీటీసీ జయగిరిధర్‌గౌడ్, ఫార్మసిస్టులు ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకులు

తమ పదవులకు రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు సీనియర్ నాయకులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని బీజేపీ మండల శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మీనరసయ్య పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఎటువంటి సమాచారం కార్యకర్తలకు సమావేశాలు లేకుండా స్వార్థపూరిత నిర్ణయాలు తీసుకొని నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 13 మండలాలకు సంబంధించిన అధ్యక్షులను రాత్రికి రాత్రే మార్పుచేయడం పై ఆసహనం వ్యక్తం చేశారు. వివిధ మోర్చాల అధ్యక్షులు తదితరులు పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఈ రాజీనామాలు సోమవారం జిల్లా అధ్యక్షులకు అందజేయనున్నట్లు తెలిపారు. తాము పదవులకు మాత్రమే రాజీనామా చేస్తున్నామని బీజేపీ పార్టీ కోసం కమల దళంలోనే కార్యకర్తలుగా కొనసాగుతామని చెప్పారు. జనసేనా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకొని నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్ గౌడ్, బీజేవైయం మండల అధ్యక్షులు ప్రణయ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బండ కృష్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొటేశ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోశెట్టి, కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ చిన్నారెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు దేవేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు హక్కుల కోసం పోరాడాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేటి విద్యార్థులు, రేపటి భావి భారత నిర్మాతలని, అటువంటి విద్యార్థులు చదువుతోపాటు తమ హక్కుల, పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం అంబేద్కర్ భవన్‌లో జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పట్ల అంకితభావంతో నాటి నుంచి నేటి వరకు సమస్యల పరిష్కారం కోసం, అంకిత భావంతో పోరాటాలు నిర్వహించే ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని, భారత స్వతంత్ర పోరాటంలో బ్రిటిష్ ముష్కరుల ఆగడాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహించిన సంఘంలో తాను పనిచేసే వచ్చినందుకు నాకు గర్వంగా ఉందని అన్నారు. నేటి విద్యార్థులు రేపటి భావి భారత నిర్మాతలని, అటువంటి విద్యార్థులు చదువుతోపాటు తమ హక్కుల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు తమ అభిరుచులను అనుగుణంగా రాజకీయాలు తప్ప అన్ని రంగాలను ఎంచుకొని న్నారని, దీనివల్ల సమాజానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, విద్యార్థులు రాజకీయాల్లోకి రాకపోవడం వల్ల చదువు సంధ్యారేని అభాగ్యులు, క్రిమినల్, రౌడీలు మెజార్టీగా మన పాలకులుగా ఎన్నిక కావడం వల్ల దేశం అన్ని రంగాలలో వెనుకబడుతున్నదని, విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని చదివి రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేసి రాజకీయంగా సామాజికంగా ఎదగాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా విద్యార్థి లోకానికి సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, నగర నాయకులు గణేష్, అరవింద్, మహేష్, తమిళ్, వైభవ్, కరణ్, సునీల్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మీ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రజలకు రెండు పడకల ఇళ్ల నిర్మాణాలను చేపట్టి ఇస్తామని ఇంతవరకు రెంజల్ మండలంలో ఒక్క కుటుంబానికి కూడా ఇవ్వలేదని వారు విమర్శించారు. సొంత స్థలం ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించి, ప్రస్తుతం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని, ఎన్నికల ప్రచారంలో భాగంగా చేసిన కుట్ర అని వారు విమర్శించారు. మళ్లీ గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టి కేవలం మూడు రోజుల్లోనే ముగించారని, ఈ పథకాన్ని నిరంతరం కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు గోపికృష్ణ, మండలాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, ప్రకాష్, సాయినాథ్, ప్రసాద్, యువత తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు దళిత బంధు ఇవ్వాలి

- ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-నవీపేట్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

అర్హులైన దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి మానికొల్ల గంగాధర్ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాలతో పాటు అర్హులైన దళితులందరికీ దళిత బంధు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు కొండ నర్సింలు, గుర్రాల మోహన్, సంజీవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచ్ మృతి

నవతెలంగాణ-సదాశివనగర్


పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

సదాశివనగర్ మండల పద్మజీవాడి గ్రామ మాజీ ఉపసర్పంచ్ సామల అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ కుటుంబాన్ని పరామర్శించి సాయిలు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 20 ఏండ్లుగా తన వెంటే నడిచినట్టు గుర్తు చేసుకున్నారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ వి.జితేష్ పాటీల్

నవతెలంగాణ-జుక్కల్

రక్తదానం.. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం లాంటిదని, అన్ని దానాలలో కన్న రక్త దానం గొప్పదని కామారెడ్డి జిల్లా కలెక్టర్ వి జితేష్ పాటిల్ అన్నారు. శనివారం జుక్కల్ మండల కేంద్రంలోని ప్రయివేట్ ఫక్షన్ హలులో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో గాయపడ్డ వారికి రక్తం అవసరం ఉంటుందని, రక్తహీనతతో ఆసుపత్రులలో రోగులకు నిత్యం వేలాది యూనిట్ల రక్తం అవసరం


మాట్లాడుతున్న కలెక్టర జితేశ్ వి పాటిల్

ఉంటుందని తెలిపారు. ఒక్కరు చేసే రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని, 18 ఎండ్లు పూర్తయిన వారు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ రక్త దాన శిబిరాలు జిల్లాలోని మండలాలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అందులో జుక్కల్ మండలం ఎప్పుడు రక్తదాన శిబిరాల ఏర్పాటుకు పిలుపు నిచ్చినపుడు మారుమూల జుక్కల్ ప్రాంత యువత ముందుకు వచ్చి రక్తదానం చేసే ఆలోచన గొప్పది అని కొనియాడారు. రాబోయే రోజులలో కూడా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఎటువంటి సమాజిక కార్యక్రమాలు చేయాలని పిలుపు నిచ్చినా ముందుండి విజయ వంతం చేయాలని యువతకు సూచించి అభినందించారు. అంతకుముందు జుక్కల్ ప్రాంతం ప్రజల సాంప్రదాయపరంగా గాంధీ టోపీ పెట్టి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, విండోచైర్మెన్ శివానంద్. ఐ ఆర్ సి ఎస్ జిల్లా, మండల శాఖ సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ అభ్యర్థుల ఎంపిక

- నేడు సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలి : డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేజీబీవీ లలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు నేడు(ఆదివారం) ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, హాల్ టికెట్, ర్యాంకు కార్డు, నాలుగు కలర్ ఫోటోలతో నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌లో గల జిల్లా పరిషత్ కార్యాలయంలో హాజరు కావాలని డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్‌లో మెస్సేజ్ పంపామని, ఫోన్ కూడా చేసినట్టు తెలిపారు. అభ్యర్థుల వివరాలకు కొత్త కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయం 117 రూమ్‌లో సంప్రదించాలని సూచించారు. ఇతరాత్ర వివరాలకు www.deonizamabad.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎంపీటీసీ రిలేదీక్షకు టీజేఎస్ మద్దతు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


దీక్షలో కూర్చున్న నాయకులు

గ్రామాభి వృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ అన్నసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి గురుప్రతాప్ చేపట్టిన రిలే దీక్షకు టీజేఎస్ నాయకులు నిజ్జన రమేశ్ మద్దతు తెలిపారు. శనివారం దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎంపిటిసి చేస్తున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని లేనిచో తెలంగాణ జన సమితి తరుపున పోరాటానికి సిద్ధంగా వున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సెంటర్ ప్రారంభం


స్టడీసెంటర్ ప్రారంభించి పుస్తకాలు, ఏర్పాట్లు పరిశీలిస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో తండ్రీకొడుకులు వడ్ల విఠల్, వడ్ల రమేశ్ కలిసి ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్‌ను శనివారం సర్పంచ్ జంగం భూషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వడ్ల విట్టల్ కుమారుడు ఫౌండర్ వడ్ల రమేష్ పేరుపైన తమ నివాస గృహంను స్టడీ సెంటర్ క్యాబిన్‌గా మార్చి విద్యార్థులు చదువుకోవడానికి ప్రశాంత వాతావరణము ఏర్పాటు చేశారని తెలిపారు. స్టడీ సెంటర్ క్యాబిన్ రూములో మౌలిక వసతులు సదుపాయాలను పరిశీలించారు. అనంతరం వడ్ల రమేష్ ఫౌండర్ మాట్లాడుతూ, ఉద్యోగ అవకాశాల కోసం ప్రిపేర్ కావడానికి కోచింగ్ తీసుకునే విద్యార్థులు మౌలిక అత్యా ఆధునిక, ఉన్నత సదుపాయాలతో ఉద్యోగుల కోసం చదువు కోసం వచ్చిన స్టడీ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సకల సౌకర్యాలతో, సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శాంతాబాయి నారాయణరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వేణుగోపాల్, ప్రతాప్ రెడ్డి విశ్వబ్రహ్మ విశ్వకర్మల తాడ్వాయి మండల అధ్యక్షులు దేమే రాజు, ప్రభాకర్ ప్రవీణ్ రెడ్డి అంజు విద్యార్థులు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

నవతెలంగాణ-మెండోరా

మెండోర మండలంలో పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ముస్కు చిన్న భూమయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి అతని కుమారుడు సురేష్ ను ఓదార్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, రవి, బడాల సాయరెడ్డి, పటేల్ నవీన్, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల మోహన్, మౌలానా, నరేశ్, అశోక్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బుల్లెట్ ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శాంతి సామరస్యం పెంపొందించాలని ఉద్దేశంతో బుల్లెట్ ర్యాలీ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ముబారక్‌నగర్‌లోని వనిల్ ఆటోమోటివ్స్ రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ నుంచి ప్రారంభమవుతుందని క్లబ్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర ఏసీపీ ఎం.కిరణ్‌కుమార్, గౌరవ అతిథిగా జాతీయ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు రాజేందర్‌రెడ్డి పాల్గొననున్నారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ నీటిమట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతండగా, కాలువల ద్వారా 7051 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.3 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1090.2 అడుగుల(85.910 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీకి పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరింది. దీంతో గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాలు కురవక పోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 110.38 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. 45.356 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.

చిన్న దుకాణం ముద్దు..

- ఆటోవాల ప్రచారం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



చిన్న కిరణా దుకాణాలను ఆశ్రయించి వాటిని బతికించాలని ఓ ఆటోవాల తన ఆటో వెనుక ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నాడు. బడాబడా కార్పోరేట్‌లు ఏర్పాటు చేసిన సూపర్‌మార్కెట్‌ల ఏర్పాటుతో గల్లీల్లో ఉండే చిన్నచితకా దుకాణాలకు గిరాకీలు తగ్గి వాటి ఉనికి కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆటో వాల అబ్దుల్ హుస్సేన్ ప్రచారం చేస్తున్నాడు. చిరు వ్యాపారస్తులు వారి జీవనోపాధి కోసం మాత్రమే హోల్‌సేల్ ధరలకు సరుకులు తెచ్చి రిటైల్ ధరలకు విక్రయిస్తుంటారని తెలిపారు. అవసరాన్ని బట్టి ఉద్దేరకు సైతం ఇస్తుంటారని కావున వాటిని బతికించుకుందామని ప్రచారం చేస్తున్నాడు.

గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలి

- మౌనదీక్షతో టీజేఎస్ నిరసన

నవతెలంగాణ-లింగంపేట్

ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని, అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలని తెలంగాణ జన సమితి పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ డా.నిజ్జన రమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో నల్ల రిబ్బన్లు కట్టుకొని మౌన దీక్ష చేపట్టారు. గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద మౌన దీక్షకు పూనుకున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోదండరాం ఇంటి చుట్టూ భారీగా పోలీస్‌లు మోహరించి గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. తొమ్మిదేళ్ల కాలంగా ఉద్యోగాల నోటిఫికేషన్ వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి శాస్త్రీయ ప్రమాణాలు లేకుండా వెంట వెంటనే నోటిఫికేషన్లు వేయడం మంచి పద్ధతి కాదన్నారు. నోటిఫికేషన్లు వేసి యువత ఆగ్రహం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న దాంట్లో బాగాగంగానే గ్రూప్-2 పరీక్షను నిర్వహిస్తున్నారని అన్నారు. ఆశాస్త్రియ మైన ఈ పరీక్షా నిర్వహణను వ్యతిరేకిస్తున్నా మన్నారు. అరెస్ట్ చేసిన వారందరిని విడుదల చేసి పరీక్షలు వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, ఉపాధ్యక్షులు పూల్ సింగ్ నాయక్, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు చాకలి కుమార్, మండల నాయకులు రతన్ నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.


నోటికి నల్లరిబ్బన్ కట్టుకొని మౌనదీక్షతో టీజేఎస్ నాయకుల నిరసన

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ-భిక్కనూర్

మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా హనుమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా పురం రాజమౌళి, డైరెక్టర్‌గా రాకేష్ రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో జిల్లా కోర్టు ప్రముఖ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్ శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. రైతులకు సేవలు చేస్తూ, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, వాసవి క్లబ్ మండల అధ్యక్షులు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


వేలిముద్రలు పరిశీలిస్తున్న క్లూస్ టీం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని జుక్కల్ మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో భారిగా చోరికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగుజూసింది. కుటుంబీకులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండల కేంద్రానికి చెందిన సుభాష్ కుమారుడు బొల్లివార్ సంజు బొంబాయిలో వలస వెళ్లి పనులు చేసుకుంటున్నాడు. తండ్రి సుభాష్ కొన్ని రోజుల క్రితం మృతిచెందాడు. సంజీవ్ తల్లి శివలక్ష్మి తన కొడుకు దగ్గరికి నాలుగు నెలల క్రితం వెళ్లింది. తిరిగి స్వగ్రామం శనివారం జుక్కల్ ఇంటికి వచ్చింది. తలుపు తీసు చూడగా ఇంట్లో వస్తువులు చిందర, వందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంట్లో ఉన్న రూపాయలు 50వేలు, కిలో వెండి చోరికి గురైందని లక్ష్మి తెలిపారు. క్లూస్ టీం వచ్చి పరిశీలించారు.

ఎన్నికల వేళ ఎల్లారెడ్డి గుర్తుకొచ్చిందా..?


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కాంగ్రెస్ పార్టీలో గెలిచి టీఆర్ఎస్‌కి అమ్ముడుపోయిన ఎమ్మెల్యే సురేందర్.. ఈసారి ఆయన కచ్చితంగా ఓటమిపాలవుతాడని సర్వేలు వెల్లడించడంతో ఎన్నికల స్టంట్‌లో భాగంగానే సోమవారం కేటీఆర్‌ను తీసుకొచ్చి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బహిరంగ సభ తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. స్థానిక ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ ఎమ్మెల్యేకు కానీ మంత్రి కేటీఆర్ గారి చిత్తశుద్ధి ఉంటే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారని ఏ ముఖం పెట్టుకొని నియోజక వర్గానికి వస్తున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. 2019లో మున్సిపల్ కేంద్రంలో శంకుస్థాపన చేసిన చిల్డ్రన్ పార్క్ ని నాలుగు సంవత్సరాలు పట్టించుకోకుండా ఇప్పుడు తూతూ మంత్రంగా హడావిడిగా కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నాసిరకం పనులు చేస్తూ ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. అదేవిధంగా 2019లో శంకుస్థాపన చేసినప్పటి నుండి అక్కడ డంపు చేసిన ఇసుకను మెటీరియల్‌ను ఎవరు అమ్ముకున్నారో అన్ని ఆధారాలు ఉన్నాయని అన్నారు.

ఒకవైపు ముఖ్యమంత్రి హరితహారం పేరుతో తెలంగాణని హరిత తెలంగాణగా మారుస్తానని గొప్పలు చెప్తుంటే ఇక్కడ మాత్రం కేటీఆర్ పర్యటన ఉందని నిజాం కాలంలో నాటినపెద్ద పెద్ద చెట్లను నరికి వేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని, ఈ విషయమై సంబంధిత అధికారులను ప్రశ్నించగా తమకు సంబంధం లేదంటూ బీఆర్ఎస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం ఎన్నికల లో నేనెక్కడ ఓడిపోతానని భయంతో బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గంలో బస్సు డిపో శంకుస్థాపన చేయించాలని, అదేవిధంగా పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంపు గురించి శంకుస్థాపన చేయించాలని అదేవిధంగా కాలేశ్వరం ప్రాజెక్టులోని అసంపూర్తిగా ఉన్న భూం పల్లి ప్రాజెక్టును పూర్తిచేయాలని మూతపడిపోతున్న ఐటిఐ కాలేజీ ను కేటీఆర్ తో పరిశీలింప చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహులు, ఆఫీజ్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలి

- హైదరాబాద్ తరలిన ఎంప్లాయిన్ యూనియన్

నవతెలంగాణ-పిట్లం



నినాదాలు చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

నూతన పెన్షన్స్ పథకం రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నకు శనివారం ఉద్యోగ ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పిట్లం మండల శాఖ అధ్యక్షులు రూప్ సింగ్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణ కోసం జాతీయస్థాయిలో నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్థిత ప్రజ్ఞ నాయకత్వంలో జరిగిన పోరాటంలో ఇటీవల కొన్ని రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పోరాటాల ఫలితంగా ఫ్యామిలీ పెన్షన్ , గ్రాట్యుటీ సాధించుకున్నామన్నారు. అలానే ఐకమత్య పోరాటంతో సిపిఎస్ విధానాన్ని రూపుమాపటానికి కలిసి పోరాటం చేయవలసిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు సంగమేశ్వర్, గణపతి, బలరాం, రాములు, సాయిలు, హట్యా సింగ్, కృష్ణంరాజు, రవికుమార్, రాజశేఖర్, కృష్ణ గౌడ్, దేవి సింగ్, సాయిబాబా, రాములు, లావణ్య , స్వరూప , ప్రేమల ,విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్

జిల్లా కోఆర్డినేటర్‌గా గంగాధర్ గౌడ్

నవతెలంగాణ-మాక్లూర్


నియామకపత్రం అందజేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్‌గా మాక్లూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన ఏ.గంగాధర్ గౌడ్‌ని నియమిస్తూ జాతీయ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన అధ్యక్షురాలు మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు జాతీయ ఆర్‌జీపీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కిరణ్ మూగబసవ్ పేర్కొన్నారు. ఈ నియామకపత్రాన్ని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ అందజేశారు. ఈ నియామకం వెంటనే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-బోధన్

ఎమ్మార్పీఎస్ సాలూర గ్రామ కమిటీని సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మొండూర్ చంటి, ఉపాధ్యక్షులుగా ధమ్మన్ గావ్ సుభాష్, ప్రధాన కార్యదర్శిగా కొండల్‌వాడి రాజు, సహాయ కార్యదర్శిగా మొండూర్ అశోక్, కోశాధికారిగా కుంటన్ సాయికుమార్, ప్రచార కార్యదర్శిగా టన్నె రవిని, అలాగే ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాదిగ మేధావుల ఫోరం జిల్లా సహాయ కార్యదర్శి లింబూరి లక్ష్మణ్, దండోర నాయకులు మొండూర్ లస్మయ్య, మొండూర్ లాలయ్య, ధమ్మన్‌గావ్ హరిబాబు, వీరేశం, బాలయ్య, భూమయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డ దుండగుడి అరెస్ట్

నవతెలంగాణ-గాంధారి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

గాంధారి మండలం లోని చద్మల్ తండా గ్రామంలో వరుసగా రెండు ఇండ్లలో చొరబడి సెల్ ఫోన్లను దొంగతనం చేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్టు గాంధారి ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గాంధారి మండలంలోని చద్మల్ గ్రామానికి చెందిన వసంతరావు, గణేష్ అనే వ్యక్తులు తాము నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో చార్జింగ్ పెట్టిన మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేసినారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రెండు వేరు వేరుగా కేసులు నమోదు అయ్యాయి. అనంతరం కేసులను దర్యాప్తు చేస్తున్న గాంధారి ఎస్సై డి.సుధాకర్ విచారణ చేస్తూ శనివారం వాహనాల తనిఖీలు చేపట్టగా కామారెడ్డికి చెందిన కళావతి సంతోష్ సింగ్(27) అనే వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, రెండు వెండి కడియాలను స్వాధీన పరచుకొని అతన్ని అరెస్టు చేసి జైలుకు పంపించినట్టు ఎస్ఐ తెలిపారు.

మంచిప్పలో యువజన దినోత్సవం



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో శనివారం గ్రామంలోని యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామి వివేకానందునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పం చ్ సిద్ధార్థ మాట్లాడుతూ.. యువత సంఘటితమై ఉన్నత ఆశయాల కోసం పనిచేయాలని, నవభారత నిర్మాణాన్ని చేపట్టాలని ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేవలం భారత దేశంలోనే అత్యధికంగా యువతీ యువకులు ఉన్నారని తెలిపారు. అలాగే జై భారత్ యువత అధ్యక్షుడు సాయిరాం మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాల యువతకు వివరించాడు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగదీష్, మాజీ ఎంపీటీసీ వెంకట్రాం, ఉపసర్పంచ్ ముత్యంరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది కురుమ లబ్దిదారులకు గొర్రెలు పంపిణీ



నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రానికి చెందిన 12 మంది కురుమ లబ్దిదారులకు తెలంగాణ ప్రభుత్వం గొర్ల పంపిణీ పథకం కింద యూనిట్‌కు 21 గొర్రెల చొప్పున 12 యూనిట్లు సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఒక యూనిట్ రూ.1,75,000 విలువ గల గొర్రెలను పంపిణీ చేశారు. 43,750 డీడీ కట్టిన 12 మంది గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ కూచి సిద్దు, కురుమ సంఘ అధ్యక్షులు గోక శంకర్, పశువైద్యులు డాక్టర్ సురేష్, పశు వైద్య సహాయకులు సుధీర్, నాయకులు పి.సాయిలు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో నేడు
మంత్రి ప్రశాంత్‌రెడ్డి పర్యటన

- **రూ.23 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్, కోనాపూర్ గ్రామాలలో రూ.23 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పాల్గొంటారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అమీర్‌నగర్ వద్ద బిక్యానాయక్ తండా నుండి కమ్మర్‌పల్లి అప్రోచ్ రోడ్ వరకు సింగిల్ లెన్ నుంచి డబుల్ లైన్ బీటీ రోడ్ విస్తరణకు రూ.4.50కోట్లతో చేపట్టే పనులకు, కొనాపూర్ గ్రామంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులతో పాటు పలు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఐదు వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి గ్రామానికి చెందిన చిత్తరి గంగవ్వ చనిపోవడంతో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాసుల బాలరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షాహిద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర దేశాయ్, ఎంపీటీసీ కొట్టం మనోహర్ శనివారం గంగవ్వ కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.

జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-కోటగిరి

జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జీపీ కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా 'సమ్మె ఎందుకు చేశారంటూ' సర్పంచ్, సంబంధిత అధికారులు కక్ష సాధింపులకు పాల్పడడం సిగ్గుచేటని, వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోటగిరి గ్రామపంచాయతీ యూనియన్ మండల నాయకుడు జాకీర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం కోటగిరిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ హక్కుల కోసం సమ్మె చేయడం నేరమా అంటూ అధికారులను ప్రశ్నించారు. కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే "చలో వర్ని" కార్యక్రమం చేపట్టి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పోశెట్టి, బ్రహ్మం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో డయాబెటిక్ క్యాంప్

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల పార్క్‌లో డయాబెటిక్ క్యాంపును నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ తెలిపారు. సుమారు 74 మంది స్త్రీ, పురుషులకు ప్రయివేట్ మెడికల్ ప్రాక్టిషనర్ డాక్టర్ దోపతి ప్రవీణ్ కుమార్ పరీక్షలు చేశారని అన్నారు. తీపిని అధికంగా తీసుకోవడం వలన చిన్న వయస్సులోనే కంటి సమస్యలు, సైనస్, వినికిడి సమస్యలు వచ్చే అవకాశం ఉందని, అంతేగాక రోగనిరోధక శక్తి తగ్గి అనేక సమస్యలు వస్తాయని, చక్కర వాడకాన్ని తగ్గించాలని, రోజుకు కనీసం 30నిమిషాలు వ్యాయామం చేయాలని, డయాబెటిక్ సమస్య రాకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్‌దాస్ అన్నారు. వీరితో పాటు కార్యదర్శి చెరుకు ప్రీథ్వీ రాజ్, కొంగి మనోహర్, లోచర్ చంద్రశేఖర్, బైరి శ్రీధర్ వాకర్స్ పాల్గొన్నారు.

విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు తరలిన పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రగతి శీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలోని ఇల్లందులో నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా పీడీఎస్‌యూ బృందం తరలివెళ్లింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అషుర్, అనిల్, జిల్లా నాయకులు మహిపాల్, సందీప్, అనూష, మమత, సలీం, సంజయ్, శివ, దీపిక తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత




ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నపల్లి గ్రామానికి చెందిన గోవూరి కృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యం పాలై మంచానికే పరిమితమవడం.. చికిత్స చేయించుకునేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న విషయాన్ని కుర్నపల్లి సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీందర్‌గౌడ్ తెలుసుకుని జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో అడ్మిట్ చేయించారు. ఈ విషయాన్ని సర్పంచ్ ఎమ్మెల్యేకు వివరించగా.. ఎమ్మెల్యే షకీల్ రూ.50వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సాయిరెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్‌ఫెస్ట్‌లో విద్యార్థినికి ద్వితీయ స్థానం



నవతెలంగాణ-మాక్లూర్

యూత్ ఫెస్ట్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా నెక్లెస్ రోడ్‌లో రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన 5కే రెడ్‌రన్‌లో మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజ్‌లో చదువుతున్న విద్యార్థి గుర్రపు రోజ ద్వితీయ స్థానం సాధించింది. అందుకుగానూ రూ.25,000 నగదుతో పాటు మెమోంటోను, సర్టిఫికెట్‌ను డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి, టీవీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, పీడీటీఎస్ఏసీఎస్ హైమావతి ఐఏఎస్ చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. జిల్లాకు ద్వితీయ స్థానం రావడం అభినందనీయమని సంబంధిత అధికారులు శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేయాలి

- **ఎస్ఎఫ్ఐ డిమాండ్**
- **రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రూప్ 2 పరీక్షను 3 నెలలకు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ ముందు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత ఐదేళ్ల నుంచి జాబ్ క్యాలెండర్ లేక అనేక మంది నిరుద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి తరుణంలో నేడు గ్రూప్స్‌కు సంబంధించిన వరుస పరీక్షల వల్ల కనీసం ఒక్క పరీక్ష నుంచి ఇంకో పరీక్షకు సమయం కూడా లేకుండా పరీక్షలు ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ 2 పరీక్ష సిలబస్ ప్రిపరేషన్ వ్యవధి తక్కువ ఉండడంతో గ్రూప్2 అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ బోర్డు ముందు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడుతుంటే పోలీసులు అత్యుత్సాహం చూపించి గ్రూప్2 అభ్యర్థులపైన లాఠీచార్జ్ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కొట్లాడి పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు, కల్వకుంట్ల వంశానికే లభిస్తున్నాయని, తెలంగాణలో ఉన్న నిరుద్యోగులకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు లభించడం లేదని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ విచారం వ్యక్తం చేసింది. తక్షణమే గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని లేకుంటే టీఎస్‌పీఎస్సీ బోర్డును ముట్టడికి అన్ని యూనివర్సిటీలో ఉన్న గ్రూప్2 అభ్యర్థులు, విద్యార్థులు ఏకమై పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇకనైనా పరీక్షల సమ్యయాలను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి సాయిప్రసాద్, యూనివర్సిటీ నాయకులు సిరాజ్, అనిల్, రమణతోపాటు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

టీడీపీ హయాంలో బడులు.. ఇప్పుడు బార్‌లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగుదేశం పార్టీ హయాంలో బడులు ఏర్పాటు చేస్తే, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం బార్లను ఏర్పాటు చేస్తుందని టీడీపీ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ మండిపడ్డారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం వర్ని చౌరస్తా, గాజుల్‌పేట్, బోయిగల్లి ప్రాంతంలో టీడీపీ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో సందర్శనలో భాగంగా మహిళలు మాట్లాడుతూ.. తెలుగుదేశం హయాంలోనే మహిళలకు అన్ని విధాలుగా గౌరవం దక్కిందని స్థానిక మహిళలు అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ప్రతి మహిళకు ఆర్థిక పరపతి కోసం మహిళా సంఘాలను ఏర్పాటు చేశారని కట్టుకున్నారని అన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ హయాంలో బడులు ఏర్పాటు చేస్తే, నేడు బీఆర్ఎస్ బార్‌లు ఏర్పాటు చేస్తుందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పి కేసీఆర్‌ని ఇంటికి సాగనంపాలని అన్నారు. కార్యక్రమంలో కల్లెడ గంగన్న, శంకర్ ముదిరాజ్, నవతే నరసయ్య, అర్సపల్లి అశోక్, హరీష్, అతీక్, సాయిలు, దాత్రిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ టీడీపీలో నాయకులు

గృహలక్ష్మి దరఖాస్తులు తీసుకోవాలి

నవతెలంగాణ-వర్ని/రెంజల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలని ఎంపీడీఓ, తహసీల్దార్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న గ్రామాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీవో మూడు కమిటీలను ఎంపిక చేశారు. ఆ పంచాయతీల కార్యదర్శులు లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను తీసుకొని అధికారులకు సమర్పించాలని తెలిపారు. తదుపరి దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులపై జీపీ కార్యదర్శులకు అవగాహన..

రెంజల్ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై ఆయా గ్రామాలలో సమగ్ర సర్వే జరపాలని గ్రామ కార్యదర్శులకు తహసీల్దార్ రామచందర్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని వారు సూచించారు. గ్రామాలలో అర్హులైన వారందరిని గుర్తించి వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని వారన్నారు. ఈ అవగాహన సదస్సులో రెంజల్ మండలంలోని గ్రామ కార్యదర్శులందరూ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై రేపు నిరసన

- **రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలి**
- **కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్**



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 14న వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రైతుల సమస్యలపై కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులు, నాసిరకం చెక్ డ్యాంలతో, కొన్నిచోట్ల చెరువు కట్టలకు మరమ్మతులు చేయకపోవడంతో చెరువు కట్టలు తెగి పంటపొలాలు మునిగిపోయాయన్నారు. కొన్ని గ్రామాల్లో భూములు కోతకు గురై వ్యవసాయానికి పనికి రాకుండా మూడు సంవత్సరాల నుంచి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా, నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. నిరసన కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కిసాన్ కేత్ మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్, నాయకులు గోపిడీ లింగారెడ్డి, పాలేపు నర్సయ్య, రాజేంద్రప్రసాద్, సింగిరెడ్డి శేఖర్, ఉట్నూర్ ప్రదీప్, సాయి, శ్రీనివాస్, పూజారి శేఖర్, శ్రీధర్, దీపాక్, శైలంధర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు 70 మంది కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో సునీల్‌రెడ్డి సమక్షంలో 70 మంది యువకులు పలు యువజన సంఘం సభ్యులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు, మురళి, రాజశేఖర్, సురేష్ ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్

రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం ఉదయం వాహనాలను తనిఖీ చేయగా బొలేరో వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. వాహనంలోని 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, పట్టుకున్న వాహనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు

- **మండలాధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ మండలంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధి పనులు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి అన్నారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో బాల్కొండ మండలంలోని 7 గ్రామాలకు బీటీ రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రూ.9 కోట్ల 7 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, బాల్కొండ మండల ప్రజల తరపున మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తౌటు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

'కోటగిరిలో డెంగ్యూ' అవాస్తవం

- **జిల్లా ఉపవైద్యాధికారిణి విద్య**

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని హరిజనవాడలో డెంగ్యూ జ్వరం వచ్చిందన్న వార్త అవాస్తవమని జిల్లా ఉపవైద్యాధికారిణి విద్య అన్నారు. శనివారం హరిజనవాడలో ఇంటింటికీ తిరిగి సిబ్బందితో సర్వే చేయించి, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. దోమలు నిల్వ ఉన్న వాటిని తొలగించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కోటగిరి మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో డెంగ్యూ అని నిర్ధారణ చేసి వైద్యం కల్పించాలని ప్రచారం జరగడంతో ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. నిజామాబాద్ తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లో మాత్రమే డెంగ్యూ పరీక్షలు నిర్వహించబడతాయని డాక్టర్ విద్య పేర్కొన్నారు. లేనిపోని ఆరోపణలు చేయవద్దని ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌కు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్వైజర్లు రవి, జ్యోతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపవైద్యాధికారిణి

బీసీల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చర్యలు శూన్యం

- **తెలంగాణ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాదల్ లక్ష్మీనారాయణ**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీసీల ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం చేసింది శూన్యమని, ఇది బీసీల బంధు పథకం కాదని, బీసీల రాబందు పథకమని తెలంగాణ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాదల్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలంగాణ ప్రభుత్వం బీసీల ఆర్థిక ప్రగతి కోసం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటైన విషయమన్నారు. బీసీబంధు పథకాన్ని ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం లక్ష రూపాయలు ఏమాత్రం సరిపోదని, దీన్ని పది లక్షల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘం ప్రధాన కార్య దర్శి నరేష్, కార్యదర్శి సూర్య, గణేష్, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకు ఉద్యమిస్తాం

- **ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జి రెహమాన్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకై ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ అన్నారు.

ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం తెలంగాణ యూనివర్సిటీలో, డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో మండల ప్రధాన కార్యదర్శి దినేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేసిన రెహమాన్, దినేష్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం పోరాటంలో విద్యార్థులను, యువకులను ఏకంచేసి బ్రిటీష్ వారిని తరిమిన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌దన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం, తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జ్ తరుణ్, విష్ణువర్ధన్, శేఖర్, అజయ్, రాజ్‌కుమార్, యాదగిరి, అభిషేక్, ఖలీల్, సంతోష్, సతీష్, ప్రభు, డిచ్‌పల్లి నాయకులు నవీన్, నితీన్, రాహుల్, క్రాంతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.